నమస్తే తెలంగాణ

# జనగామ

5 | సోమవారం 29 జనవరి 2024 | JANAGAON




# వరంగల్‌లో రియల్ జోరు

**గ్రేటర్‌లో వేగంగా స్థిరాస్తుల అభివృద్ధి.. పక్కా ప్రణాళికతో మారుతోన్న నగర ముఖచిత్రం**

పట్టణాలుగా శివారు గ్రామాలు.. వరంగల్ వైపు రియల్టర్ల చూపు

వరంగల్, జనవరి 28 : రాష్ట్రంలోనే రెండో పెద్ద నగరమైన గ్రేటర్ వరంగల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు కేటాయించడంతో నగరంలో స్థిరాస్తుల అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ప్రజలు జీవన ప్రమాణాలు పెరుగడంతో నగరంలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు అనేక వర్గాలు మొగ్గుచూపుతున్నాయి. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ప్రత్యేక విజన్‌తో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి అమలు చేస్తోంది. ఇటు నగరానికి మణిహారంగా ఉన్న ఇన్నర్, ఔటర్‌రింగ్ రోడ్ నిర్మాణంతో శివారు ప్రాంతాలు పట్టణ శోభను సంతరించుకున్నాయి. ఇలా నగరంలోనే గాక శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందుతుండడంతో రియల్టర్లు వరంగల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు.

### రింగ్ రోడ్లతో రియల్ భూమ్

నగరం చుట్టూ ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల నిర్మాణంతో రియల్ రంగం ఊపందుకుంది. జాతీయ రహదారుల అనుసంధానంతో రవాణా వ్యవస్థ మెరుగుపడింది. హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారితో ములుగు వైపు, జగిత్యాల-కోదాడ జాతీయ రహదారితో ఖమ్మం వైపు భూములకు రెక్కలు వచ్చాయి. మామునూరు వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడంతో వరంగల్‌లో రియల్ వ్యాపారం బంగారంగా మారుతోంది. ఒకప్పుడు హైదరాబాద్‌లో ఇంటి స్థలం కొనాలనే వారు ఇప్పుడు వరంగల్‌లో స్థలం కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అలాగే నగరాన్ని పక్కా ప్రణాళికలతో అభివృద్ధి చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్‌లో రింగ్ రోడ్ల చుట్టూ కమర్షియల్ జోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధికార యంత్రాంగం ఓఆర్ఆర్ చుట్టూ విల్లాలు, అపార్ట్‌మెంట్లు, ఎంటర్‌టైన్‌మెంట్ పార్క్‌లు, కార్పొరేట్ విద్యాసంస్థల ఏర్పాటుకు మాత్రమే అనుమతులు వచ్చేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. నగరం మధ్యలో ఓ సిటీ, నగర శివారులో మా సిటీ, యుని సిటీ పేరిట కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చేసిన వెంచర్లకు విశేష ఆదరణ వచ్చింది. ఊహించని విధంగా ధరలు పలికాయి. దీంతో పాటు నగర శివారుల్లో ప్రైవేట్ సంస్థలు చేస్తున్న వెంచర్లు సక్సెస్ అవుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థలు ఇక్కడ వెంచర్లు చేయడానికి ముందుకు వస్తున్నాయి.

### పెరుగుతోన్న అపార్ట్‌మెంట్ కల్చర్..



మెట్రోపాలిటన్ సిటీలకే పరిమితమైన అపార్ట్‌మెంట్ కల్చర్ ఇప్పుడు నగరంలో పుంజుకుంది. దీంతో అనేక మంది వెంచర్ డెవలపర్స్‌గా, బిల్డర్స్‌గా మార్కెట్‌లోకి అడుగుపెడుతున్నారు. ఆధునిక వసతులతో అపార్ట్‌మెంట్‌లే కాకుండా ఇండిపెండెంట్ ఇళ్లు, విల్లాస్‌ను బిల్డర్స్ నిర్మిస్తున్నారు.

### వేలాది మందికి ఉపాధి..

నగరంలో రియల్ బూమ్‌తో కన్‌స్ట్రక్షన్ రంగంలో వేలాది మందికి ఉపాధి దొరుకుతోంది. ఇక్కడి వారితో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు పది వేల మంది కార్మికులు నిర్మాణ రంగంలో పని చేస్తున్నట్లు అంచనా. ఇటుక నుంచి ఇంటీరియర్ వరకు వేలాది మంది నిర్మాణ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

### నిర్మాణరంగానికి బ్యాంకుల ఊతం..

బ్యాంకులు ఇచ్చే హౌసింగ్ లోన్లతో నిర్మాణ రంగం పుంజుకుంటోంది. వంద గజాల స్థలం ఉంటే చాలు బ్యాంకులు గృహ రుణాలు మంజూరు చేస్తున్నాయి. తక్కువ వడ్డీకే ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు హౌసింగ్ రుణాలు అందిస్తుండడంతో మధ్యతరగతి వర్గాల సొంతింటి కలలు నెరవేరుతున్నాయి. దీంతో ఇసుక, ఇటుక, స్టీల్, సిమెంట్, పెయింట్స్, ఇంటీరియర్ డెకరేషన్ వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి.

### వరంగల్ రియల్ ఎస్టేట్‌కు మంచి మార్కెట్..



నగరంలో రియల్ ఎస్టేట్‌కు మంచి మార్కెట్ ఉంది. ఫ్యూచర్ సిటీగా ఎదుగుతున్న వరంగల్‌లో వివిధ జిల్లాలకు చెందిన వారు స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. పారిశ్రామిక నగరంగా ఎదిగే అవకాశం ఉన్న వరంగల్‌లో ఇప్పటి వరకు చేసిన వెంచర్లు విజయవంతమయ్యాయి. నగరం చుట్టూ జాతీయ రహదారులు అనుసంధానం కావడం, టెక్స్‌టైల్ పార్కులు, రైల్వే సంబంధిత ప్రాజెక్టులు రావడంతో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు వచ్చింది.

– గోగుల లక్ష్మీ విజయకుమార్, ఏవీ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

### హౌసింగ్ రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి



డీసీసీబీ నుంచి హౌసింగ్ రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వ్యవసాయ భూములను మార్టిగేజ్ చేసుకుని హౌసింగ్ రుణాలు ఇస్తున్నాం. గ్రామీణ ప్రాంతం వారికి రూ.30 లక్షలు, మండల కేంద్రంలో రూ. 50 లక్షలు, నగరంలో ఇంటి స్థలాలపై రూ. 70 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తున్నాం.

– మార్నేని రవీందర్‌రావు, చైర్మన్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్

### సర్పంచ్ ఎన్నికలంటే కాంగ్రెస్‌కు భయం : మాజీ మంత్రి సత్యవతి

సర్పంచ్ ఎన్నికలంటే కాంగ్రెస్‌కు భయమని అందుకే పదవీ కాలం ముగిసినా ఎన్నికలు వాయిదా వేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ విమర్శించారు. పంచాయతీ ఎన్నికలను పక్కన పెట్టి అవిశ్వాసాలకు తెర లేపిందన్నారు. కాంగ్రెస్‌వి అమలు కానీ హామీలని సత్యవతి విమర్శించారు. 50రోజుల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని, రైతుబంధుకు రాంరాం చెప్పారన్నారు. కాంగ్రెస్ మంత్రులు, నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజల గొంతుకై పోరాటం చేసేది ఒక్క బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. బీఆర్ఎస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. పాలకుర్తి పోరాటాల గడ్డ అని, సైనికుల వలె పని చేసి వరంగల్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి తదితరులు

- కాంగ్రెస్, బీజేపీలవి మిలాఖత్ రాజకీయాలు : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- అభివృద్ధిని అడ్డుకుంటే ధర్నాలు తప్పవు : మాజీ మంత్రి ఎర్రబెల్లి
- దాడులు చేస్తే ప్రతిదాడులు తప్పవని హెచ్చరిక
- సర్పంచ్ ఎన్నికలంటే కాంగ్రెస్‌కు భయం : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

# పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలి..

పాలకుర్తిలో 50వేల మెజార్టీ రావాలి

**కాంగ్రెస్‌వి 420 హామీలు.. అమలుచేయకుంటే పోరాటం చేస్తాం.. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



హాజరైన పార్టీ శ్రేణులు

పాలకుర్తి రూరల్, జనవరి 27 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తిలోని బృందావన్ గార్డెన్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన పాలకుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవని.. హక్కుల కోసం పోరాటం చేస్తూ ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ పార్టీయేనని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు సమన్వయంతో పనిచేసి బీఆర్ఎస్‌ను విజయం వైపు నడిపించాలన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రక్షాళన చేస్తామని, పార్టీ ద్రోహులను ఉపేక్షించేది లేదన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను ఆపితే ధర్నాలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఆరు గ్యారెంటీలతో పాటు డిక్లరేషన్‌లను ఇచ్చిందని, కాంగ్రెస్‌వి నిజంగా 420 హామీలనేనని ఎద్దేవా చేశారు. అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ ఎక్కడ అని ప్రశ్నించారు. రైతులకు బోనస్ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. రైతు బంధు, రైతు బీమా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హామీలను 100 రోజుల్లో అమలు చేయకపోతే ప్రజాపోరాటం చేస్తామన్నారు. 50 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని.. 2028లో మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓడిపోవడం బాధాకరమన్నారు. రూ. వేల కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. పాలకుర్తి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పార్లమెంట్ ఎన్నికల్లో కసిగా పనిచేయాలని సూచించారు. పాలకుర్తి నియోజకవర్గంలో 50వేల మెజార్టీ తీసుకురావాలని పిలుపునిచ్చారు.

### కాంగ్రెస్ బీజేపీలవి మిలాఖత్ రాజకీయాలు : ఎమ్మెల్యే పల్లా



కాంగ్రెస్, బీజేపీలవి మిలాఖత్ రాజకీయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇరు పార్టీల రహస్య మైత్రి బయటపడిందన్నారు. గవర్నర్ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కోదండరాంను ఎమ్మెల్సీగా ఎలా అంగీకరించారో గవర్నర్ చెప్పాలని ప్రశ్నించారు. కోదండరాం ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పోటీ చేశారని గుర్తుచేశారు. దాసోజు శ్రావణ్, ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణను ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తే గవర్నర్ అడ్డుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీల మిలాఖత్ రాజకీయాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. సీఎం, మంత్రులు ఇష్టారీతిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రంగనాయక సాగర్‌పై మంత్రి కొండా సురేఖ మాట్లాడిన మాటలు హాస్యాస్పదమన్నారు. సీఎం రేవంత్, మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, వారికి ప్రజలే ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. అక్రమ కేసులకు, అవిశ్వాసాలకు భయపడేది లేదన్నారు, అధికారం శాశ్వతం కాదని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. రైతుబంధు 11సార్లు వేశామన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో లక్షా 28వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా పంటలకు నీళ్లిచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు రైతు బంధు రాలేదని అడిగితే మంత్రులు చెప్పుతో కొడుతామని అంటున్నారని మండిపడ్డారు. ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్ వెంటే ఉన్నారని, తెలంగాణ ప్రజలు తెలివైనవారని, ఎంపీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల మనిషి దయన్న ఓటమి బాధాకరమని, పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఎర్రబెల్లికే దక్కిందన్నారు.

### కార్యకర్తలు అధైర్యపడొద్దు: ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి

బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే గొడవలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దని, గెలుపు ఓటములు సహజమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో 50వేల మెజారిటీ సాధించడం ఖాయమన్నారు. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో పాలకుర్తి నియోజకవర్గానికి రూ. వేల కోట్ల నిధులు తెచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. మంజూరైన నిధులను అడ్డుకుంటే ధర్నాలు తప్పవని హెచ్చరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి గడ్డ నుంచే మరోసారి పోటీ చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి చేయడం సాధ్యం కాదని, వచ్చిన నిధులను అడ్డుకోవద్దని సూచించారు. త్వరలో గ్రామాల వారీగా అభివృద్ధి పనుల నివేదిక అందజేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలను 100రోజుల్లో అమలు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు మాట్లాడుతూ వరంగల్ ఎంపీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు పాలకుర్తి నియోజకవర్గ ఓటమిపై సమీక్ష నిర్వహించుకోవాలన్నారు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీనాయక్, ఎంపీపీలు నల్లా నాగిరెడ్డి, జినుగు అనిమిరెడ్డి, ధరావత్ జ్యోతి, తూర్పాటి ఆంజయ్య, ఈదూరు ఐలయ్య, జడ్పీటీసీలు పుస్కూరి శ్రీనివాసరావు, మంగళంపల్లి శ్రీనివాస్, పల్లా సుందర్ రామిరెడ్డి, రంగు కుమార్, శ్రీరాం సుధీర్‌కుమార్, కేలోత్ సత్తమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పసునూరి నవీన్, తీగల దయాకర్, వసుమర్తి సీతారాములు, ఏలె సుందర్, వంగ అర్జున్, ఈదునూరి నర్సింహారెడ్డి, వీ రాంచంద్రయ్య శర్మ, ముత్తినేని శ్రీనివాస్, పేరం రాము, దీకొండ వెంకటేశ్వర్‌రావు, పూస మధు, మాచర్ల ఎల్లయ్య, వీరమనేని యాకాంతారావు, కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, ఎర్రబెల్లి వినయ్‌రావు, పసునూరి మధు, విక్రంరెడ్డి, గడ్డం రాజు పాల్గొన్నారు.



## రేపటి నుంచి అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

**కాజీపేట నుంచి 30వ తేదీ సాయంత్రం మొదటి రైలు పరుగులు**

కాజీపేట, జనవరి 28 : కాజీపేట నుంచి అయోధ్యకు ఆస్తా ప్రత్యేక రైళ్లు ఈ నెల 30న ప్రారంభం కానున్నాయి. కాజీపేట జంక్షన్ నుంచి అయోధ్యకు 15 రైళ్లు, మరో 15 రైళ్లు అయోధ్య రైల్వే స్టేషన్ నుంచి కాజీపేటకు నడువనున్నాయి. మంగళవారం సాయంత్రం 6:20 గంటలకు కాజీపేట నుంచి (07223) నంబర్‌తో మొదటి రైలు బయలు దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3:35 గంటలకు అయోధ్య రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6, 8,10,12, 14, 16,18, 20, 22, 24, 26, 28 తేదీల్లో సాయంత్రం 6:20 గంటలకు కాజీపేటలో బయలు దేరనున్నాయి. అయోధ్య నుంచి ఫిబ్రవరి 2, 4, 6, 9, 11,13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, మార్చి 2న మధ్యాహ్నం 14:20 గంటలకు అయోధ్య రైల్వే స్టేషన్‌లో బయలు దేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేటకు చేరుకుంటాయని వివరించారు. ఈ ప్రత్యేక రైళ్లు పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్‌పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగ్‌పూర్, ఇటార్సీ, భోపాల్, ఝాన్సీ, కాన్పూర్ స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా భక్తులు ప్రత్యేక రైళ్లను వినియోగించుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

## 30, 31న సాహిత్యంపై కేయూలో సదస్సు

పోచమ్మమైదాన్, జనవరి 28: కాకతీయ యూనివర్సిటీ, వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 30, 31న వల్లంపట్ల సాహిత్యం–సామాజిక చైతన్యం అంశంపై రెండు రోజులపాటు కేయూలోని కామర్స్ సెమినార్ హాల్‌లో జాతీయ సదస్సు ఉంటుందని తెలుగు విభాగాధిపతి, సదస్సు సంచాలకులు అచార్య బన్న ఐలయ్య తెలిపారు. సదస్సులో తెలుగు సాహిత్య విద్యార్థులు, కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


